క్రైమ్ ది మిర్రర్ ®
Voice of Anti Corruption

హైదరాబాద్
27-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 37

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# నెక్స్ట్ టార్గెట్ బీఆర్ఎస్?!

## గులాబీ పార్టీలో రాఘవ్ చద్దా ఎవరు?

## హరీష్ రావు పైనే అనుమానం



## ఆందోళనలో గులాబీ పార్టీ



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:

గులాబీ పార్టీ భయపడుతోందా? ఆమ్ ఆద్మీ పార్టీకి ఎదురైన పరిణామమే ఎదురు కాబోతోందా? భారత రాష్ట్ర సమితిలో సైతం రాఘవ్ చద్దా ఉన్నారా? గులాబీ పార్టీని సైతం బిజెపి అడ్డగోలుగా చీల్చనుందా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా తమ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులతో బిజెపిలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు అందరి దృష్టి భారత రాష్ట్ర సమితి వైపు పడింది.

**వరుసగా కష్టాలు..**

తెలంగాణలో గులాబీ పార్టీ సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆ పార్టీకి వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ఇంతలోనే కవిత రూపంలో మరో షాక్ తగిలింది. పదేళ్లపాటు తిరుగులేని శక్తిగా వెలిగిన భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తన ఉనికి కాపాడుకోవడమే అతిపెద్ద సవాల్ గా మార్చుకుంది. ఈ క్రమంలో కేసీఆర్ పార్టీని సైతం బిజెపి లాగేసుకుంటుందన్న ప్రచారం ఢిల్లీ పొలిటికల్ సర్కిల్లో తెగ హల్చల్ చేస్తోంది. తమ రాజకీయ అస్తిత్వం కోసం కేసీఆర్ కమలం గూటికి ఫ్యామిలీతో సహా చేరుతారన్న టాక్ బలంగా వినిపిస్తోంది.

**అప్పటి నుంచి పతనం..:** 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో గులాబీ పార్టీ పతనం ప్రారంభం అయింది.

2లో



## అందరివాడు రేవంత్!

### కాంగ్రెస్ అగ్రనాయకత్వం నమ్మకం

### కేంద్ర బిజెపి పెద్దల పాలనా సహకారం

### ఎమ్మెల్సీ పెండింగ్ ఫైల్ విషయంలో తెలంగాణ సీఎం సక్సెస్

తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ఒక సంచలనం. అణచివేత నుంచి పుట్టుకొచ్చిన నాయకత్వం ఆయన. స్వల్ప కాలంలోనే తెలంగాణలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. అసలు ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయో నన్న ఆందోళనలు ఉండేవి. అటువంటి సమయంలోనే తనదైన శైలిలో అడుగులు వేస్తూ.. ప్రత్యర్థులను సైతం ఆశ్చర్యపరిచే రాజకీయ పరిణితి ప్రదర్శిస్తున్నారు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

2లో

## తన వివరాలు స్వయంగా నమోదు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణలో సెన్సస్ 2027 సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభం
- స్వయంగా వివరాలు నమోదు చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్
- కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మే 10 వరకు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం
- తెలంగాణకు తొలి, దేశానికి మొదటి డిజిటల్ జనగణన ఇదే
- ఈసారి జనాభా లెక్కల్లో కులగణన కూడా చేపట్టనున్న అధికారులు

2లో

## నారా లోకేష్ ఎక్కడ?!

### గత కొద్ది రోజులుగా కనిపించని యువనేత


### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒకటే టెన్షన్



ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు నారా లోకేష్. ఇప్పటికే తెలుగుదేశం పార్టీకి అన్నీ తానై వ్యవహరిస్తున్న ఆయనకు ప్రమోషన్ లభించింది. ఆయన ఒక్కరే కాదు.. చాలామంది యువ నేతలకు టిడిపి కార్యవర్గాల్లో స్థానం లభించింది. నారా లోకేష్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ నియామకాలు అన్నట్టు విశ్లేషణలు ఉన్నాయి.

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** అయితే గత కొద్ది రోజులుగా నారా లోకేష్ పెద్దగా కనిపించకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. ఆయన ఏదైనా విదేశాలకు వెళ్లారా? లేకుంటే సొంత రాష్ట్రంలోనే ఉన్నారా? ఎక్కడికి వెళ్లారు? స్థానికంగా ఉంటే అందుబాటులో ఎందుకు లేరు? అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం

2లో



## వివాదంలో అషు రెడ్డి...

### తండ్రి ఏమంటున్నారంటే..!

- అషురెడ్డి రూ.9.5 కోట్ల మేర మోసం చేసిందంటూ ఆరోపణలు
- స్పందించిన తండ్రి వెంకటకృష్ణారెడ్డి
- అబ్బాయికి అప్పటికే పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని వెల్లడి
- ఆర్థిక లావాదేవీలతో తమకు సంబంధం లేదని స్పష్టీకరణ
- సోమవారం ప్రెస్ మీట్ పెట్టి తన కుమార్తె నిజాలు చెబుతుందన్న తండ్రి

బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డిపై వచ్చిన రూ. 9.5 కోట్ల మోసం ఆరోపణల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. ఈ వివాదంపై అషురెడ్డి తండ్రి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా మీడియా ముందుకొచ్చి సంచలన విషయాలు వెల్లడించారు.

3లో

## అచ్చం తండ్రి మాదిరిగా?!

- ట్రెండీ లుక్‌తో విదేశీ పర్యటనకు జగన్మోహన్ రెడ్డి
- అప్పట్లో రాజశేఖర్ రెడ్డి సూట్‌తో విదేశాలకు
- ఇప్పుడు జీన్స్‌తో కనిపించిన వైసిపి అధినేత

ఫ్యామిలీతో యూరప్ ట్రిప్

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లారు. యూరప్ పర్యటనకు గాను కుటుంబ సమేతంగా వెళ్లారు. సిబిఐ ప్రత్యేక కోర్టు అనుమతితో 15 రోజులపాటు ఆయన విదేశీ పర్యటన కొనసాగించనున్నారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి ఆయన బయలుదేరారు.



2లో

## ఇక మా టైం మొదలైంది: కవిత

- తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో కవిత కొత్త పార్టీ
- 'మీ టైం అయిపోయింది, మా టైం మొదలైంది' అంటూ సంచలన ట్వీట్
- పార్టీ ఆవిర్భావ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు
- తండ్రి కేసీఆర్ పార్టీ పాత పేరుతోనే కొత్త రాజకీయ ప్రయాణం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' పేరుతో



2లో

## ట్రంప్ విందులో కాల్పులు...

- ఇదే అదనుగా ఖరీదైన వైన్ బాటిళ్లు ఎత్తుకెళ్లిన 'అతిథులు'
- అధ్యక్షుడు ట్రంప్‌ను సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆమె మాటలు నిజం అయ్యాయి!
- 'షాట్స్ విల్ బి ఫైర్డ్' అన్న ప్రెస్ సెక్రటరీ
- ట్రంప్ వాడీవేడి ప్రసంగం చేస్తారన్న ఉద్దేశంలో ఆమె వ్యాఖ్యలు
- ఆ తర్వాత నిజంగానే కాల్పులు
- ట్రంప్‌ను సురక్షితంగా తరలించిన సీక్రెట్ సర్వీస్

2లో

2లో



## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- అన్నదాత కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్త కార్యక్రమం
- గ్రామాల్లో పర్యటించనున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు
- వివిధ అంశాలపై రైతులకు బృందాలతో అవగాహన

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

పంటల సాగులో రైతులకు సరికొత్త పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమాన్ని అమలు చేయనుంది. సోమవారం (ఈ నెల 27) నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' పేరుతో ఈ కార్యక్రమం చేపట్టనుంది. మే 23వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలలో పర్యటిస్తారు. రైతులతో సమావేశమై సాగుకు సంబంధించి, వివిధ అంశాలను వారికి వివరిస్తారు. ఇందుకోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలతో కలిసి 200 బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బృందాలు గ్రామాలలో పర్యటించి రైతులతో సమావేశం కానున్నాయి. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, సాగునీటి పొదుపు, ఎరువుల వినియోగం, యూరియా వాడకాన్ని తగ్గించటం వంటి అంశాలపై రైతులకు శాస్త్రవేత్తల బృందం శిక్షణ ఇస్తారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలోని రైతులకు పంపిణీ చేయడానికి 8 రకాల వరి వంగడాలను గుర్తించినట్లు చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న రకాలనే రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ సోనా, బీపీటీ 5204, జైశ్రీరాం, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్ 44, టీజీసీ 1798, డబ్ల్యూజీఎల్ 962 రకాలను రైతులకు అందించనున్నట్లు వివరించారు. వానాకాలం ప్రారంభానికి ముందే రైతులకు విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇక తెలంగాణపై ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ మంత్రి పర్కొన్నారు. ఎల్ నినో కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో పండే నూనె గింజలు, ఆయిల్ పామ్, పప్పుధాన్యాల సాగు దిశగా రైతులు ఆలోచించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా.. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు.

# నారా లోకేష్ ఎక్కడ?!

ఈ విషయంలో ఆందోళనతో ఉంది.

**తరచూ పర్యటనలు..**

నారా లోకేష్ ఈ రాష్ట్రానికి మంత్రిగా ఉన్నారు. అయితే రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకొచ్చే క్రమంలో ఆయన తరచూ పర్యటనలు చేస్తుంటారు విదేశాలకు. మరోవైపు ఆయనకు క్రికెట్ అంటే ఇష్టం. అంతర్జాతీయ మ్యాచ్ ల సమయంలో.. మన దేశం ఆడే మ్యాచ్ ల కోసం ఆయన ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు దేశాలకు వెళుతుంటారు. అయితే ఈ పరిణామాల క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదే పనిగా లోకేష్ పై విమర్శలు చేస్తూ ఉంటుంది. ప్రభుత్వ ఖర్చుతో ఆయన పర్యటనలు అన్నట్టు ప్రచారం చేస్తూ ఉంటుంది. అయితే తన సొంత ఖర్చులతోనే లోకేష్ ఎక్కువగా క్రికెట్ మ్యాచ్లకు వెళుతుంటారు. అయితే ఇప్పుడు నారా లోకేష్ ఎక్కడికి వెళ్లారు అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అనుకూల మీడియాలో అయితే చిన్నబాబు ఎక్కడ అని కథనాలు ప్రచురిస్తున్నారు. అసలు లోకేష్ ఎక్కడ ఉన్నారు అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న టెన్షన్.

**ప్రత్యేక ప్రకటన లేదు..**

సాధారణంగా క్యాబినెట్ మంత్రి విదేశాలకు వెళ్తే కచ్చితంగా ప్రభుత్వానికి సమాచారం ఇస్తారు. ఆపై మంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రకటన కూడా వస్తుంది. కానీ నారా లోకేష్ విషయంలో అటువంటిదేమీ లేకుండా పోయింది. అలాగని రాజకీయ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో లోకేష్ కనిపించడం లేదు. దీంతో అంతటా దీనిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల్లో అయితే ఆందోళన కనిపిస్తోంది. సజ్జల రామకృష్ణారెడ్డి ఒక అడుగు ముందుకు వేసి లోకేష్ ఎక్కడ అని ప్రశ్నించి తనలో ఉన్న టెన్షన్ ను బయటపెట్టారు.

# తన వివరాలు స్వయంగా నమోదు చేసిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణలో సెన్సస్ 2027 ప్రక్రియ ఆదివారం అధికారికంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన వివరాలను అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా నమోదు చేసి, సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వయం నమోదు) ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఈ ప్రక్రియ మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లను కలిపి ఒకే యూనిట్‌గా ఈ జనగణన చేపడుతున్నారు. మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. పౌరులు ఒవ.ఎవఅ-ంబం.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి, తమ వివరాలను సమర్పించవచ్చు. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఇందులో గృహ, వసతులు, ఆస్తులకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి పత్రాలు అవసరం లేదని, 15-20 నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. వివరాలు సమర్పించాక వచ్చే సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ (ఎస్ఈ ఐడీ)ని, వెరిఫికేషన్ కోసం వచ్చే సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది. ఇది భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన కావడం విశేషం. అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి సెన్సస్ కూడా ఇదే. ఈసారి కులగణన కూడా చేపట్టనున్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించే ప్రక్రియ ఉంటుంది. ఈ కార్యక్రమంలో సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నెక్స్ట్ టార్గెట్ బీఆర్ఎస్?!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ప్రతిపక్ష పార్టీగా గౌరవప్రదమైన సీట్లను గెలుచుకుంది. కానీ 2024 సార్వత్రిక ఎన్నికలకు వచ్చేసరికి మొత్తం సీన్ మారింది. ఆ పార్టీ పూర్తిగా డీలా పడింది. కనీసం ఉనికి చాటుకోలేకపోయింది. ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేక పోవడమే కాదు.. దాదాపు 15 శాతానికి పైగా ఓట్లను ఆ పార్టీ కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలన్న లక్ష్యంతో తన ఓటు బ్యాంకును బిజెపికి బదలాయించింది. అయితే ఈ వ్యూహంతో భారతీయ జనతా పార్టీ భారీగా లబ్ది పొందింది. భారత రాష్ట్ర సమితి చావు దెబ్బతింది. తద్వారా ప్రధాన ప్రతిపక్ష పాత్రను బిజెపికి అప్పగించింది గులాబీ పార్టీ. ఇది ముమ్మాటికి ఆ పార్టీ స్వయంకృతాప వ్యూహం. దాని పర్యవసానాలను ఇప్పుడు అనుభవిస్తుంది భారత రాష్ట్ర సమితి.

**వరుస ఢిల్లీ పర్యటనలు**

ప్రస్తుత పరిస్థితుల్లో హరీష్ రావు ద్వారా బిజెపి గేమ్ స్టార్ట్ చేసినట్లు ప్రచారం నడుస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీలో హరీష్ రావు మాదిరిగానే రాఘవ్ చద్దా ఉండేవారు. ఆ పార్టీకి ఒక వ్యూహ కర్త మాదిరిగా వ్యవహరించేవారు.




అయితే ఉన్నట్టుండి ఆయన బిజెపిలో చేరడం వెనుక కాషాయ వ్యూహం ఉంది. ఇప్పుడు హరీష్ రావు ద్వారా గులాబీ పార్టీపై అదే ప్రయోగం చేయబోతున్నారు అనేది పొలిటికల్ సర్కిల్లో జరుగుతున్న ప్రచారం. గులాబీ పార్టీలో నెంబర్ 2 నేతగా ఉన్నారు హరీష్ రావు. తాజాగా ఆయన ఢిల్లీ పర్యటనలు, బిజెపి అగ్రనేతలతో రహస్య మంతనాలు జరుపుతున్నారని ప్రచారం గులాబీ పార్టీ శ్రేణుల్లో కలవరం సృష్టిస్తోంది. ఈ పరిణామం తోనే పార్టీలో అడ్డగోలు చీలిక రానుందని అనుమానాలు పెరుగుతున్నాయి. రాజకీయ విశ్లేషకులు సైతం ఇదే అభిప్రాయంతో ఉన్నారు.

**కేవలం ఆ ఆలోచన తోనే..**

మరోవైపు కవిత రాజకీయ పార్టీ ఏర్పాటు వెనుక కుటుంబ సభ్యుల ముందస్తు వ్యూహం ఉందని అర్థం అవుతోంది. ఒకవేళ గులాబీ పార్టీని బిజెపిలో విలీనం చేస్తే ప్రాంతీయ పార్టీ ఒకటి తమ కుటుంబానికి ఉండాలన్నది వ్యూహంగా తెలుస్తోంది. ఒకవేళ గులాబీ పార్టీ విలీనం అయితే తెలంగాణలో రెండు జాతీయ పార్టీలే మనుగడ లో ఉంటాయి. ఇటువంటి తరుణంలో కేసీఆర్ ఫ్యామిలీ అస్తిత్వం కోసం కవితతో పార్టీ పెట్టించారన్నది పొలిటికల్ పండితుల అనుమానం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో భారత రాష్ట్ర సమితి ఉనికి నామమాత్రంగా మారితే.. తప్పకుండా బిజెపి వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టు పోరు ఉంటుంది. అయితే జాతీయ రాజకీయాల్లో ఉనికి చాటుకోవాలన్న ప్రయత్నంలో తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చి చేతులు కాల్చుకున్నారు కేసీఆర్. అయితే ఇప్పుడు బిజెపి గులాబీ పార్టీని కబలించడం ఖాయమన్న సంకేతాలు అందుతుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

# అందరివాడు రేవంత్!

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా గవర్నర్ కోట ఎమ్మెల్సీల నియామకానికి రాజ్ భవన్ ఆమోదం ముద్ర పడడం రేవంత్ రెడ్డి సాధించిన వ్యూహాత్మక విజయం.

**ఇటువంటి సంధి కాలంలో..**

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రి. కాంగ్రెస్ పార్టీ అంటేనే భారతీయ జనతా పార్టీ మండి పడిపోతుంది. అటువంటిది కాంగ్రెస్ సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి కేంద్రంలో బిజెపిని వ్యతిరేకిస్తూనే.. రాష్ట్ర ప్రయోజనాల విషయంలోనూ.. తన రాజకీయ నిర్ణయాల విషయంలోనూ బిజెపి నుంచి ఎలాంటి అడ్డంకులు రాకుండా చూసుకుంటున్నారంటే ఆయన పరిణితి సాధించినట్టే కదా. జాతీయస్థాయిలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అత్యంత నమ్మకమైన ఫైర్ బ్రాండ్ గా ఎదిగారు. మోడీ ప్రభుత్వం పై ఆయన చేసే విమర్శలు ఢిల్లీ స్థాయిలో కూడా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇటువంటి సమయంలోనే తెలంగాణలో గవర్నర్ కోట ఎమ్మెల్సీల ఫైలును గడువు కంటే ముందే ఆమోదింప చేసుకోవడం అనేది చిన్న విషయం కాదు. ఒకవేళ బిజెపి కేంద్ర నాయకత్వం రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలని భావిస్తే ఈ ప్రక్రియ ముందుకి వెళ్ళేది కాదు. కానీ అలాంటిదేమీ జరగకపోవడంతో రేవంత్ ఢిల్లీ పరపతి కూడా పెరిగినట్లు అర్థమవుతోంది.

**పాలనాపరమైన రిలేషన్స్..**

రేవంత్ రెడ్డి తనలో ఉన్న రాజకీయ కోణమే కాదు.. కేంద్ర పెద్దలతో పాలనాపరమైన రిలేషన్స్ కొనసాగిస్తున్నారు అనేది ఈ పరిణామం ద్వారా తెలిసింది. అందర్నీ కలుపు కెళ్లే మనస్తత్వంతోనే కేంద్ర పెద్దలు ఆయన విషయంలో ప్రత్యేక భావనతో ఉన్నట్లు అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన, బిజెపి భావజాలం కలిగిన గవర్నర్తో పెండింగ్ లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయించుకోవడం ఆయన రాజకీయ చాతుర్యానికి నిదర్శనం. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలతో ఘర్షణకు వెళ్లకుండా పనులు పూర్తి చేసుకోవడం అంత ఈజీ కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎమ్మెల్సీల నియామకంతో రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలను కొట్టారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం నమ్మకాన్ని నిలబెడుతూనే.. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మరీ సంక్లిష్ట పరిస్థితులను అధిగమించారు. కేవలం ఎమ్మెల్సీ పదవుల నియామకం కాదు కానీ.. రేవంత్ రెడ్డి రాజకీయ దౌత్యానికి లభించిన గుర్తింపు గానే భావించాలి.

# ఇక మా టైం మొదలైంది: కవిత

కొత్త పార్టీని ప్రకటించిన ఆమె, ఆ తర్వాత చేసిన తొలి ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'మీ టైం పూర్తయ్యింది.. మా టైం మొదలైంది" అంటూ ఎక్స్‌లో ఆమె పోస్టు పెట్టారు. శనివారం హైదరాబాద్‌లోని మునీరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాజకీయాల్లో తన పార్టీ ఒక కొత్త శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్న కవిత, ఎట్టకేలకు సొంత పార్టీతో ప్రజల ముందుకు వచ్చారు. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన తండ్రి కేసీఆర్ స్థాపించిన పార్టీ అసలు పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)'ని పోలి ఉండేలా 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)' అని నామకరణం చేయడం. బీఆర్ఎస్ నుంచి వేరుగా, సొంత రాజకీయ అస్తిత్వం కోసం కవిత ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె చేసిన ట్వీట్, ఎవరిని ఉద్దేశించిందనే దానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.

# అచ్చం తండ్రి మాదిరిగా?!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆయన న్యూ లుక్ తో కనిపించారు. సాధారణ దుస్తులు కనిపించే జగన్మోహన్ రెడ్డి ఈసారి జీన్ షర్టు తో పాటు షూస్ ధరించి సరికొత్త లుక్ తో కనిపించడం విశేషం. మే 15 వరకు ఆయన విదేశీ పర్యటన కొనసాగనుంది. అటు తరువాత తిరిగి ఆయన తాడేపల్లికి చేరనున్నారు.

**సీబిఐ కోర్టు అనుమతి**

జగన్మోహన్ రెడ్డి పై సిబిఐ కేసులు ఉన్నాయి. ఆయన విదేశాలకు వెళ్లాలంటే సిబి ఐ ప్రత్యేక కోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వ్యక్తిగత కుటుంబ అవసరాలరీత్యా తాను విదేశీ పర్యటనకు వెళ్లాలనుకుంటున్నానని ఆయన సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విదేశీ పర్యటనకు సంబంధించి కోర్టు అనుమతి ఇచ్చింది. వాస్తవానికి ఈనెల 20 నుంచి ఆయన పర్యటన కొనసాగాల్సి ఉంది. కానీ వివిధ కారణాలతో ఆలస్యం అయింది. శనివారం రాత్రి ఆయన బెంగళూరు విమానాశ్రయం నుంచి యూరప్ దేశాలకు పయనం అయ్యారు. మే 15న ఆయన తిరిగి ఏపీకి రానున్నారు. అప్పటివరకు పార్టీ సమన్వయ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించినట్లు తెలుస్తోంది.

**సోషల్ మీడియాలో వైరల్..**

మరోవైపు జగన్మోహన్ రెడ్డి న్యూ లుక్ సంబంధించి ఫోటోలతో పాటు వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఆయన డ్రెస్సింగ్ స్టైల్ అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఏపీలో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి వైట్ షర్ట్, గోధుమ రంగు ప్యాంటు, సాధారణ చెప్పులతోనే నిరాడంబరంగా కనిపిస్తారు. కానీ ఈసారి మాత్రం ట్రెండీ లుక్ లో కనిపించారు. జీన్స్ షర్ట్, జీన్స్ ప్యాంట్, షూస్, ఖరీదైన వాచి ధరించి కనిపించారు. ఎయిర్పోర్టులోని ప్రయాణికులు, అభిమానులు ఆయనతో ఫోటోలు దిగేందుకు క్యూ కట్టారు. వాటికి సంబంధించిన ఫోటోలతో పాటు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**ఆ సమయంలో రాజశేఖరరెడ్డి..**

గతంలో మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లే సమయంలో కూడా ఇలాగే ట్రెండీగా కనిపించేవారు. ఏపీ రాజకీయాలతో పాటు జాతీయస్థాయిలో ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొన్న రాజశేఖర్ రెడ్డి పంచ కట్టులో కనిపించేవారు. కానీ విదేశీ పర్యటనకు వెళ్లే సమయంలో మాత్రం ఎక్కువగా షూట్ తో కనిపించి... ట్రెండీ లుక్ తో ఆకట్టుకునేవారు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం తండ్రికి తగ్గట్టు ట్రెండీ లుక్ తో విదేశాలకు వెళ్లడం విశేషం. మహానేతను గుర్తుచేస్తూ జగన్మోహన్ రెడ్డిని విపరీతంగా వైరల్ చేస్తున్నారు ఆయన అభిమానులు.

# అమెరికాను ఇరాన్ కొట్టింది మామూలు దెబ్బ కాదు!

అమెరికాతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ జరిపిన దాడుల వల్ల మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలకు ఊహించిన దానికంటే చాలా ఎక్కువ నష్టం వాటిల్లినట్లు అమెరికా అధికారులే అంగీకరిస్తున్నారు. ఈ నష్టం విలువ బిలియన్ల డాలర్లలో ఉంటుందని, మరమ్మతులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని ఎన్‌బీసీ న్యూస్ తన కథనంలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ దళాలు ఏడు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడుల్లో కమాండ్ సెంటర్లు, విమాన హ్యాంగర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, రన్‌వేలు, రాడార్లతో పాటు కొన్ని విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికాకు చెందిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని, ఇరాన్‌కు చెందిన పాతతరం ఎఫ్-5 ఫైటర్ జెట్ కూడా దాడి చేయగలగడం అమెరికా సైనిక వర్గాలను ఆశ్చర్యపరిచింది.

# రేపటి నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు...

సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే కురుగొండ్ల

**ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న ఉత్సవాలు**

**ముఖ్యమంత్రికి స్వామివారి ప్రసాదాన్ని, ఆశీర్వచనం అందించిన అర్చకులు**

**ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

ముఖ్యమంత్రి చంద్రబాబును నెల్లూరు జిల్లా పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా, ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు



వైభవంగా జరగనున్న పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా రావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వారి వెంట వచ్చిన ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేను, ఆలయ ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు.

# ట్రంప్ విందులో కాల్పులు...

(మొదటి పేజీ తరువాయి)



వాషింగ్టన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల కలకలం రేగగా, మరోవైపు కొందరు చేసిన పని తీవ్ర వివాదాస్పదమైంది. ప్రాణభయంతో పరుగులు తీయాల్సిన సమయంలో, కొందరు టేబుళ్లపై ఉన్న ఖరీదైన వైన్ బాటిళ్లను చేతుల్లో పట్టుకుని బయటకు వెళ్లడం కెమెరాల్లో రికార్డయింది. ఈ వీడియోలు వైరల్ కావడంతో జర్నలిస్టుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం రాత్రి వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో ఈ వార్షిక విందు జరిగింది. దీనికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ, ఉన్నతాధికారులు, జర్నలిస్టులు, ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా బాల్‌రూమ్ సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దం వినిపించడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ట్రంప్ దంపతులను అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు. అతిథులంతా భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ గందరగోళం మధ్యే కొందరు అతిథులు, టేబుళ్లపై ఉన్న వైన్, షాంపేన్ బాటిళ్లను తీసుకుని వెళ్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై నెటిజన్లు తీవ్రంగా మండిపడ్డారు. "విపత్తులో అవకాశాన్ని వెతుక్కున్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వివాదానికి 'వైన్-గేట్' అని పేరు పెట్టారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా పోలీసులు గుర్తించారు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు పలు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ట్రంప్ వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో సీక్రెట్ సర్వీస్ అధికారి ఒకరికి బుల్లెట్ తగిలినప్పటికీ, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ఉండడంతో అతనికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిందితుడిపై ఫెడరల్ చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు -- తాళ్లపల్లిలో రాజకీయ సంచలనం



**క్రైమ్ మిర్రర్, షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని తాళ్లపల్లి గ్రామం రాజకీయంగా కీలక పరిణామానికి వేదికైంది. గ్రామంలోని పలువురు ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ బాస నరసింహులు తన అనుచరులతో కలిసి షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు, యువకులు పాల్గొని ఈ చేరికలకు మద్దతు తెలిపారు. దాదాపు 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు ఒకేసారి పార్టీ కండువా కప్పుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మాట్లాడిన అవినాష్ రెడ్డి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు తమ అనుచరులతో కలిసి బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, వార్డు మెంబర్లు బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో అండగా ఉంటామని, వారి రాజకీయ భవిష్యత్తుకు బలమైన మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఉపసర్పంచ్ బాస నరసింహులు మాట్లాడుతూ, తాను గతంలో టిఆర్ఎస్ పార్టీలో పని చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినా, తగిన గుర్తింపు లేకపోవడంతో మళ్లీ బిఆర్ఎస్ పార్టీలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తిరిగి చేరుతున్నానని పేర్కొన్నారు. తనతో పాటు వార్డు మెంబర్లు, అనుచరులు కూడా పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీని "అమ్మలాంటిది"గా అభివర్ణించారు. ఏ పార్టీ నుంచి వచ్చిన వారినైనా ఆత్మీయంగా ఆహ్వానిస్తూ, వారికి పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందించే లక్షణం ఈ పార్టీకే ప్రత్యేకమని తెలిపారు. పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, విజయపథంలో నడిపించే శక్తి బిఆర్ఎస్‌కు ఉందన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి చేరికలు జరుగుతుంటాయని, అయితే ఇక్కడ అధికార పార్టీ నుంచే ప్రతిపక్షానికి చేరికలు జరగడం రాబోయే ఎన్నికలకు శుభసూచకమని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి, షాబాద్ మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ బాస నరసింహులు, కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి బాస లావణ్య, మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు, నాగరగూడ మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణా గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తి రామస్వామి, మాజీ సర్పంచ్ బాస విట్టల్, లక్ష్మారావుగూడ సర్పంచ్ కుమార్, మక్తగూడ సర్పంచ్ నారం రెడ్డి, దోస్వాడ మాజీ సర్పంచ్ రాములు, పాలపల్లి కాంగ్రెస్ నాయకులు జగన్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా ఈ భారీ చేరికలు షాబాద్ మండలంలో రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముందని స్థానిక రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.



## టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక.

**ఇబ్రహీంపట్నం(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ టీఎన్జీవో, యూనియన్ రంగారెడ్డి జిల్లా అర్బన్ యూనిట్, సర్వ సభ్య సమావేశం ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో టీఎన్జీవో జిల్లా అర్బన్ యూనిట్ అధ్యక్షుడిగా వ్యవసాయ శాఖకు చెందిన గోపాల్ నాయక్, కార్యదర్శిగా ట్రెజరీ విభాగానికి చెందిన సాయి తేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా టీఎన్జీవో ఆడ్ హాక్ కమిటీ నాయకులు యశ్వంత్, రంగయ్య, శ్రీనివాసులు, మాధవ సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు టీఎన్జీవో సంఘం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. నూతన కార్యవర్గంలోని ఇతర సభ్యులుగా ఎం.ఏ. ఫిరోజ్ ఆడిట్ విభాగం, ఉపాధ్యక్షులుగా శ్రీపతి కుమార్ వ్యవసాయ శాఖ, రవి, జి. సాయి కుమార్ ట్రెజరీ, సంయుక్త కార్యదర్శిగా భాగ్యవతి మహిళా సంక్షేమం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బిక్షపతి రెవెన్యూ, ప్రచార కార్యదర్శిగా మల్లేష్ గిరిజన సంక్షేమం, ఈసీ సభ్యులుగా మాధవి రెవెన్యూ, బాలరాజు మత్స్య శాఖ, సంయుక్త కార్యదర్శిగా శంకర్ రాథోడ్ వెల్ఫేర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ కృతజ్ఞతలు చాటుకున్నారు.

## కన్నతండ్రిని విమర్శిస్తే చరిత్ర క్షమించదు: కవితపై ఎస్. వెంకటేష్ తీవ్ర ఆగ్రహం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారిపై ఇటీవల కవిత చేసిన అనుచిత వ్యాఖ్యలను కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం కాటేదాన్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం సొంత తండ్రినే విమర్శించడం ఆమె అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ఒక వైపు అమ్మగా పరిణతి చెందాలని చెబుతూనే, మరోవైపు కన్నతండ్రిని మరమనిషిగా ముద్ర వేయడం సిగ్గుచేటు. కేసీఆర్ గారిని తిడితే ముఖ్యమంత్రి అయిపోతానని భ్రమ పడొద్దు. ప్రజల మన్ననలు, స్పష్టమైన లక్ష్యం లేని పార్టీలు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం. రాజకీయాల్లో ఊసరవెల్లిలా ప్రవర్తించే వారికి భవిష్యత్తు ఉండదు అని అన్నారు. సొంత తండ్రిని, అన్నను మానసిక క్షోభకు గురిచేసిన చరిత్ర హీనురాలిగా కవిత మిగిలిపోతుందని ఆయన ఆరోపించారు. కన్నవారిని బాధపెట్టిన వారు బాగుపడినట్లు చరిత్రలో లేదు. తండ్రినే గౌరవించని వ్యక్తి ఇక 4 కోట్ల తెలంగాణ ప్రజల బాగోగులు చూస్తానంటే లోకులు నమ్ముతారా? అని ప్రశ్నించారు. తప్పుడు హామీలతో ప్రజలను వంచించడం మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ లాంటి మహాయోధుడిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. కవిత తన తీరు మార్చుకోకపోతే రాజకీయంగా కనుమరుగవడం ఖాయమని హెచ్చరిస్తూ, బేషరతుగా బీఆర్ఎస్ అధినాయ కత్వానికి క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ కలెక్టర్‌గా ప్రియాంక అల

హైదరాబాద్: కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ కావడం సంచలనంగా మారింది. కొంత కాలంగా పనితీరు బాగాలేని అధికారులను బదిలీ చేస్తామంటున్న ప్రభుత్వం.. తాజాగా జరిపిన ఐఏఎస్‌ల బదిలీల్లో నగరంతో సంబంధమున్న వారు పలువురుండటం హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలోనే ఆర్థిక ఇంజిన్‌గా ఉన్న క్యూర్ పరిధిలోని అధికారులు బదిలీ కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ఎల్ఈటీ అండ్ఎఫ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా బదిలీ కాగా.. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అల హైదరాబాద్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. క్యూర్‌లోని ఆరు జోన్ల జోనల్ కమిషనర్లను మార్చడం సంచలనంగా మారింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ సీఈఓ పి.ఉదయ్‌కుమార్‌ను గోల్కొండ జోనల్ కమిషనర్‌గా, నాగర్ కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోను ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌ను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు.



## వివాదంలో అషు రెడ్డి...

తన కూతురు అమాయకురాలని, అసలు తప్పు అవతలి వారిదేనని ఆయన పేర్కొన్నారు. అషురెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి అన్ని విషయాలు వివరిస్తుందని తెలిపారు. వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "2021లో కాకినాడ నుంచి సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్ చేసి, అషురెడ్డికి పెళ్లి సంబంధం గురించి మాట్లాడారు. మా అమ్మాయి గురించి మీకెలా తెలుసు అని అడిగాను. మీ అమ్మాయికి, మా అబ్బాయి ధర్మేంద్రకు ఉద్యోగం చేసే దగ్గర పరిచయం అని ఆయన చెప్పారు. అయితే, మేము తెలిసిన వారి ద్వారా విచారించగా కొన్ని నిజాలు తెలిశాయి. అప్పటికే ధర్మేంద్రకు పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని, తండ్రి సత్యనారాయణ నడుపుతున్న ఫైనాన్స్ కంపెనీపై కాల్ మనీ కేసు ఉందని తెలిసింది. దీంతో ఈ సంబంధం వద్దని నిర్ణయించుకున్నాం" అని వెంకటకృష్ణారెడ్డి వివరించారు. ఆ తర్వాత వారి గురించి మళ్లీ ఇప్పుడే వింటున్నామని ఆయన అన్నారు. తన కూతురు తల్లి ప్రోత్సాహంతోనే ఇండస్ట్రీలోకి వచ్చిందని, ఆమెకు బయట ప్రపంచం గురించి పెద్దగా తెలియదని వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. "మా అమ్మాయి అమాయకురాలు. ఆమెపై వచ్చిన ఆర్థిక ఆరోపణల్లో వాస్తవం లేదు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. ఒకవేళ ఉంటే నిరూపించుకోవాలి" అని ఆయన సవాల్ విసిరారు. ప్రస్తుతం అషురెడ్డి వేరే ఊరిలో ఉందని, ఈ రాత్రికల్లా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, ఈ వివాదం వెనుక ఉన్న అసలు నిజాలను అషురెడ్డే స్వయంగా వెల్లడిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో అషురెడ్డి ఏం చెప్పబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెడుతోంది. 1995–2004 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా మార్చిన చంద్రబాబు, ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్‌లో మరో భారీ టెక్ విప్లవానికి నాంది పలుకుతున్నారు. అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ తన ఏఐ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తుండటమే దీనికి నిదర్శనం. ఈ నెల 28వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా విశాఖ జిల్లా తర్లువాడ వద్ద ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. ఇది కేవలం ఒక డేటా సెంటర్ కాదు, ఆసియా ఖండానికే కీలకమైన ఏఐ గేట్‌వేగా విశాఖను మార్చబోయే ఒక చారిత్రాత్మక ఘట్టం. ఈ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ టెక్నాలజీ పటంలో విశాఖ నగరానికి శాశ్వత స్థానం లభించనుంది. ఫలితంగా, పోర్టు నగరంగా ప్రసిద్ధి చెందిన విశాఖ, ఇకపై "డేటా సిటీ"గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందనుంది. గూగుల్ ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 15 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టనుంది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో (ఎఫ్‌డీఐ) ఒకటిగా నిలవనుంది.




# ప్రజా సమస్యలపై మణికొండలో నిరసన కార్యక్రమం

## మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ



గండిపేట(క్రైం మిర్రర్): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమవుతున్నా రని మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తెలిపారు. ప్రజల సమస్యపై సోమావరం శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయం పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపటనున్నారు. గతంలో ఉన్న మణికొండ పురపాలక సంఘానికి ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌కు అపరిష్కృత ప్రజా సమస్యలపై మణికొండ బీఆర్ఎస్ పార్టీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినను సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నం చేయలేదన్నారు. ఈ కారణంగా ఇది వరకే సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కారం కాకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని నివేధించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పుప్పాలగూడ గ్రామం నుంచి స్మశానవాటికకు రహదారి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయం పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. రానున్న కాలంలో ఇదే తీరు అపరిష్కృత ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

# శంకర్ గౌడ్ త్యాగం..ఆర్టీసీ పోరాటానికి విజయం



**కామారెడ్డి క్రైమ్ మిర్రర్ న్యూస్ :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల పోరాటం శంకర్ గౌడ్ బలిదానం వల్ల వారి హక్కుల సాధనలో చారిత్రాత్మక మలుపు తీసుకువచ్చిందని జిల్లా జై గౌడ ఉద్యమ అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్ అన్నారు.శంకర్ గౌడ్ మరణం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ఉధృతం కావడంతో ప్రభుత్వం చివరకు కార్మికుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించిందన్నారు.ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలను అంగీకరించడంతో ఆర్టీసీ కార్మికుల్లో ఆనందం వ్యక్తమైందని ఆయన పేర్కొన్నారు.శంకర్ గౌడ్ త్యాగం కార్మిక లోకాన్ని కదిలించి ఐక్యతను మరింత బలపరిచిందని,ఆయన త్యాగం వృథా కాలేదని అన్నారు.ఇక జిల్లా జై గౌడ ప్రధాన కార్యదర్శి అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ....శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా నిలవడం ప్రతి కార్మికుడి బాధ్యత అని పిలుపునిచ్చారు.కార్మికులందరూ తమ ఒక్కరోజు వేతనాన్ని విరాళంగా అందించాలని సూచించారు.శంకర్ గౌడ్ ప్రాణత్యాగం తెలంగాణ కార్మిక ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని నాయకులు పేర్కొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు ప్రారంభం: 1600 గ్రామాల్లో 2.4 లక్షల రైతులకు మార్గదర్శనం




**గండిపేట్.:( క్రైమ్ మిర్రర్ ):** రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమాన్ని నాలుగు వారాల పాటు నిర్వహిస్తోంది.వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య వెల్లడించిన ప్రకారం, ఈ కార్యక్రమంలో 400 మంది శాస్త్రవేత్తలు, 400 మంది వ్యవసాయ శాఖ అధికారులు, 800 మంది విద్యార్థులు పాల్గొని 1600 గ్రామాల్లో సుమారు 2.4 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా మార్గదర్శనం చేయనున్నారు.ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా రఘునాథపాలెం రైతు వేదిక వద్ద రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇతర జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు కూడా హాజరై య్యారు.ఈ కార్యక్రమాన్ని .కార్యక్రమం ద్వారా అధిక ఎరువుల వినియోగం వల్ల కలిగే నష్టాలు, రసాయనాల వినియోగం తగ్గింపు, పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. అలాగే మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం పెంచే మార్గాలపై సూచనలు అందించనున్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా తీసుకుని ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఉపకులపతి అల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు.

# మట్టి మనుషులమా? మాత్రల మనుషులమా?



ఒకప్పుడు మన పూర్వీకులు మాడుతున్న ఎండలో పొలం దున్నేవారు. తుఫాను వానలో తడుస్తూ పని చేసేవారు. కష్టాలను, కన్నీళ్ళను, ఆకలిని సైతం ధైర్యంగా ఎదుర్కొనేవారు. వారి శరీరాలు వజ్ర సమానంగా ఉండేవి. కానీ నేడు మన సమాజం ఆ స్థితిలో లేదు. నేటి మానవుడు ఒక్క ఎండకు, ఒక్క జల్లు వానకు కూడా తట్టుకోలేని నీరసస్థితిలో కూరుకుపోయాడు. ఇది ఒట్టి శారీరక బలహీనత మాత్రమే కాదు ఇది మానసికంగా, సామాజికంగా, నైతికంగా కూడా మనిషి పతనమవుతున్నాడన్న సత్యాన్ని మన ముందుంచుతోంది.

(×అర్ఘిత్ +తీఖ్అటఅఝ్అశీఅ) అనే మనోవ్యాధి సమాజాన్ని అన్ని స్థాయిల్లో ముంచెత్తుతోంది. నేడు యువతలో నిరాశ, ఆందోళన, డిప్రెషన్ అనే మాటలు రోజూ వినిపిస్తున్నాయి. చిన్న వైఫల్యాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడే ఘటనలు పెరిగిపోతున్నాయి. ఒక విద్యార్థి పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినా జీవితాన్ని చాలించుకోవడానికి వెనుకాడడం లేదు. ఇది ఆ విద్యార్థి తప్పు మాత్రమే కాదు ఇది మన సమాజం కల్పించిన విపరీతమైన ఒత్తిడి, పోటీ, అసహనం యొక్క ఫలితం.ఇక అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, నేటి సమాజంలో దాదాపు మూడు వంతుల మంది అంటే ఏ వయసు వారైనా రోజువారీ జీవితాన్ని గడపడానికి ఏదో ఒక టాబ్లెట్ లేదా మందు తీసుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారు. ఇది ఒక చేదు నిజం. పొద్దున నిద్ర లేవగానే బీపీ (ధ్రీా) మాత్ర వేసుకోకుండా రోజు మొదలవదు. ఆ తర్వాత షుగర్ మాత్ర. మధ్యాహ్నానికి జీర్ణం కావడానికి ఒక మాత్ర. రాత్రి నిద్రపోవడానికి మరొక మాత్ర. ఇంకా యాసిడిటీ, తలనొప్పి, ఒత్తిడి తగ్గడానికి మాత్రలు ఒక్క మనిషి రోజుకు ఎన్ని రసాయనాలను మింగుతున్నాడో లెక్క పెడితే ఆశ్చర్యం వేస్తుంది.ఈ స్థితికి కారణాలేమిటి? అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, నిద్రలేమి ఇవన్నీ కలిసి మానవ శరీరాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి.

ఈ మార్పు కేవలం ఒక తరం మార్పు కాదు, ఇది ఒక జీవన విధ్వంసం.మన పూర్వపు తరాల మనుషులు మండుటెండలో కూడా పొలానికి వెళ్ళేవారు. చెట్టు నీడలో కూర్చుని సేద తీర్చుకుని మళ్ళీ పని చేసేవారు. వారి శరీరాలు ప్రకృతితో అనుసంధానమై ఉండేవి. కానీ నేడు ఒక కిలోమీటరు దూరం నడిచి వెళ్ళడానికి కూడా ఆటో, క్యాబ్ కావాలి. ఏ.సి. (AC) లేకుండా నిద్రపట్టదు. ఐదు నిమిషాలు ఎండలో నిలబడితే తల నొప్పి వస్తుంది. ఒక వాన జల్లు తగిలితే జ్వరం వచ్చేసింది అని డాక్టర్ వద్దకు పరుగులు తీస్తారు. ఇది హాస్యాస్పదంగా కనిపించినప్పటికీ, వాస్తవికత మాత్రం చాలా తీవ్రంగా ఉంది. ప్రకృతికి దూరంగా జరిగిన మానవ శరీరం, ప్రకృతి శక్తులను తట్టుకోలేని స్థితికి చేరుకుంది. ఏ.సి., కూలర్లు, ఫ్రిజ్జులు మనకు సౌకర్యాన్ని ఇచ్చాయి నిజమే, కానీ అదే సమయంలో మన శరీరం యొక్క సహజ నిరోధక శక్తిని (×ఎఎబఅఙఎ) నాశనం చేశాయి. ఒక్క చుక్క వర్షపు నీరు తగిలినా అనారోగ్యం పాలయ్యే తరం ఇది ఏ దేశానికైనా శాపం. మన పూర్వీకులు ప్రకృతిని జయించలేదు, ప్రకృతితో కలిసి జీవించారు. మనం ప్రకృతిని జయించాలనుకుని, మనల్ని మనం బంధించుకున్నాం.ఇక మానసిక స్థితి గురించి మాట్లాడితే నేటి సమాజంలో ఓపిక అనే మాటకు అర్థమే తెలియడం లేదు. ఒక్క నిమిషం ఇంటర్నెట్ స్లో అయినా చిరాకు పడతారు. లైన్లో రెండు నిమిషాలు నిలబడితే కోపం వస్తుంది. భార్యాభర్తల మధ్య చిన్న మాటపట్టింపు వస్తే విడాకుల వరకు వెళ్తున్నారు. పిల్లలు ఒక్క మాట చెప్పినా వినకపోతే వారిపై అరుస్తారు. ఇది ఎంత దారుణమైన స్థితి?సహనం అనేది ఒక జాతి యొక్క గొప్పతనానికి చిహ్నం. సహనమే మహా తపస్సు అని మన పెద్దలు చెప్పారు. కానీ ఈ సూక్తులు ఇప్పుడు కేవలం పుస్తకాల్లో మాత్రమే మిగిలిపోయాయి. ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియాలు, ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి ఇవన్నీ ఇప్పుడే కావాలి, వెంటనే కావాలి అనే ధోరణిని మనిషిలో పెంచాయి. ఈ 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్'

**ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, కల్తీ నూనెలు, రసాయన ఎరువులతో పండించిన ఆహారం ఇవి మనిషి శరీరాన్ని లోపల్నుండి తినేస్తున్నాయి. వైద్య రంగంలో విపరీతమైన అభివృద్ధి జరిగింది, అది నిజమే. కానీ ఆ అభివృద్ధి మనిషిని ఆరోగ్యవంతుడిగా తయారు చేయలేకపోయింది. ఎప్పుడూ డాక్టర్ వద్ద, మందుల మీద ఆధారపడే బతుకును అభివృద్ధి అంటామా? మాత్రలు వేసుకోకుండా పని చేయలేని, నిద్రపోలేని మానవుడు ఇది జీవచ్ఛవంలా బతకడమే తప్ప మనుగడ కాదు.**

ఒక సమాజం బలంగా ఉండాలంటే దానిలోని వ్యక్తులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. ఒత్తిడిని తట్టుకొనే సహనం, కష్టాలను ఎదుర్కొనే ధైర్యం, జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించే శక్తి ఇవి ఉంటేనే ఆ సమాజం నిలబడుతుంది. కానీ నేడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మాత్రలపై ఆధారపడిన, ప్రకృతికి భయపడే సమాజం ఎంత కాలం నిలబడగలదు?తల్లిదండ్రులు పిల్లలకు కష్టాలు చెప్పడం లేదు, సవాళ్ళు ఇవ్వడం లేదు. ప్రతిదీ అరచేతిలోకి రెడీమేడ్‌గా ఇస్తున్నారు. దీనివల్ల రాబోయే తరం మరింత బలహీనంగా తయారవుతోంది. మనం పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదు, కానీ వారికి కష్టపడే తత్వాన్ని, ఓర్చుకునే సహనాన్ని బహుమతిగా ఇవ్వాలి.ఈ సమస్యలకు పరిష్కారం ప్రభుత్వం నుండి రాదు, అది మన ఇళ్ళ నుండి, మన మనస్సుల నుండే రావాలి.ఉదయాన్నే నడక, ఎండలో కొద్దిసేపు గడపడం, తోట పని వంటివి అలవాటు చేసుకోవాలి.సంప్రదాయ ఆహారానికి ప్రాముఖ్యతనివ్వాలి. మన తాతల కాలం నాటి చిరుధాన్యాలు, ఆకుకూరలు మళ్ళీ మన పళ్ళెంలోకి రావాలి.జీవితంలో ప్రతిదీ వెంటనే దొరకదు అనే సత్యాన్ని పిల్లలకు నేర్పాలి. ఓటమి కూడా విజయానికి మొదటి మెట్టు అని వారిని మానసికంగా సిద్ధం చేయాలి. చిన్న చిన్న సమస్యలకు వంటింటి చిట్కాలు, యోగా, ధ్యానం వంటి సహజ పద్ధతులను ఆశ్రయించాలి.మన పూర్వీకులు ఏ మాత్రలు లేకుండా, ఏ ఏ.సి.లు లేకుండా 90 ఏళ్ళు ఆరోగ్యంగా జీవించారు. వారికి ఉన్నది కేవలం క్రమశిక్షణ మరియు ప్రకృతి పట్ల గౌరవం. నేడు మనకు అన్ని వనరులు ఉన్నాయి, కానీ ఆరోగ్యం లేదు. మనం మారకపోతే, రాబోయే చరిత్ర మనల్ని ఒక బలహీనమైన తరం గా ముద్ర వేస్తుంది. సాంకేతికతను వాడుకుందాం, కానీ దానికి దాసోహం కాకూడదు. సౌకర్యాలను అనుభవిద్దాం, కానీ శ్రమను మరువకూడదు.ఈ భూమి మనది, ఈ సమాజం మనది. దాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాల్సిన బాధ్యత కూడా మనదే. ఇప్పటికైనా మేల్కొందాం. మన జీవనశైలిని మార్చుకుందాం. బలమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం. లోకాః సమస్తాః సుఖినోభవంతు!




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


# జావేద్ సంతాప సభలో కాంగ్రెస్ నేతల ఘన నివాళులు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** దివంగత కాంగ్రెస్ నాయకుడు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ సంతాప సభ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై జావేద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జావేద్ కుమార్తెలు సహేల కుర్రత్, సబాహత్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ముక్తార్ జోహారా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహమ్మద్ జావేద్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. కష్టకాలంలో కూడా పార్టీని విడిచిపెట్టకుండా నిబద్ధతతో పనిచేసిన నాయకుడిగా ఆయన నిలిచారని తెలిపారు. ఖమ్మం పర్యటనల సమయంలో ఎప్పుడూ తనతో ఉండే జావేద్ లేకపోవడం ఎంతో బాధ కలిగించిందన్నారు. జావేద్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, ఆ కుటుంబాన్ని ఎప్పటికీ ఒంటరిగా వదిలిపెట్టబోమని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఆయన ఇద్దరు పిల్లల బాధ్యతను పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జావేద్‌కు ఘన నివాళులర్పించారు. మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జావేద్ అకాల మరణం మన అందరికంటే ఎక్కువగా భాధించేది భట్టి విక్రమార్క అని,నగర కాంగ్రెస్ కార్యకర్తల కు, పార్టీ కి తీరని లోటని అన్నారు. పార్టీ కష్ట కాలంలో పార్టీకి నిబద్ధతతో పనిచేసి ఎనలేని సేవలు అందించిన వ్యక్తని,సన్మానసభ చేయవలసిన తరుణంలో సంతాప జరపటం చాలాబాధాకరం అని, ఖమ్మం అన్ని పార్టీల రాజకీయ నేతలు సమన్వయంతో ఆదర్శవంతంగా నిర్వహిస్తారని అన్నారు.



# కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వడ్డే చంద్రయ్య రంగారెడ్డి జిల్లా

శంషాబాద్ మండల్ ముచ్చింతల్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ వడ్డే చంద్రయ్య తెలంగాణ రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా కార్యదర్శిగాఎన్నికయ్యారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు మరియు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నరసయ్యలను మర్యాదపూర్వకంగా కలిసి, తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్, ఉపాధ్యక్షుడు చిటికెల వెంకటయ్య, ముచ్చింతల్ మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్యతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు కావలి కృష్ణ, కావలి జీవన్, కావలి వినోద్ తదితరులు చంద్రయ్యను అభినందించారు.కిసాన్ మోర్చా ద్వారా రైతులకు అండగా నిలవాలని ముచ్చింతల్ బీజేపీ కార్యకర్తలు ఆకాంక్షించారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 26(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 2010--11 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం రోజున బిజెఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ దామోదర్ రెడ్డి , ఉపాధ్యాయులు నాగమ్మ, నాగభూషన్, అన్నపూర్ణ, సుజాత, యాదగిరి హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. చాలా కాలం తరువాత ఒకే వేదికపై కలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందభరిత క్షణాలను గడిపారు. విద్యార్థులు కట్టెల ఆనంద్, సూర్వి రాజేష్, యముడాలా లింగస్వామి, సూర్వి సురేష్, బోయ వంశీ తేజ, జి .శివారెడ్డి, సూర్వి. మహేష్, జి .లింగస్వామి, వి .మహేష్ వై . శ్రీకాంత్, సమీరా, కవిత, సంతోష, అశ్విని, సునీత, సుష్మ, ధనమ్మ, లావణ్య తదితరులు సహా సుమారు 60 మంది హాజరయ్యారు. వారు తమ విద్యా దశలో ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి ఘనంగా గౌరవించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఈ సమ్మేళనం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధం మరింత బలపడింది. ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

## పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన బాల్డా వెంకటేష్ పై ఫిర్యాదు

### చేసిన మోటాకొండూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 26:** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలం మరియు గ్రామంలో గత కొద్దిరోజులుగా వర్టూరు గ్రామం వైపు వెళ్ళు దారిలో మెయిన్ రోడ్డు పైన బాల్డా వెంకటేశం మరియు కొందరు ఇండ్లు నిర్మించుకొని గత కొద్ది కాలంగా వారికి సంబంధించిన ఇంట్లోంచి మురుగునీరు మరియు మోరి నీరు రోడ్డుపైకి వదలడంతో గ్రామస్తులకు మరియు రోడ్డుపైన వెళ్లే వారికి ఇబ్బంది కల్గిస్తున్నందున గ్రామస్తులు గ్రామపంచాయతీ సెక్రటరీని సంప్రదించగా మోటకొండూర్ గ్రామపంచాయతీ సెక్రటరీ సంతోష్ గతంలో రెండుసార్లు నోటీసులు ఇచ్చి మురిగినీరు రోడ్డుపైకి రాకుండా తగు మరమ్మతులు చేసుకోవాలని నోటీసు ఇచ్చి చెప్పినారు. అయినను బాల్డా వెంకటేశం తన ప్రవర్తనలో మార్పురాకుండా అదేవిదంగా తన ఇంటినుండి మోరి,మురుగు నీరు రోడ్డు పైకి వదిలినారు. ఇట్టి విషయం గురించి శనివారం రోజు(తేదీ 25/4/2026 మధ్యాహ్నం 1:30 ప్రాంతంలో)పంచాయతీ సెక్రెటరీ సంతోష్ మరియు గ్రామపంచాయతీ సిబ్బందితో అక్కడికి వెళ్లి మురికినీరును క్లీన్ చేస్తుండగా బాల్డా వెంకటేష్ తండ్రి యాదయ్య గ్రామ పంచాయతీ సిబ్బందితో బూతు మాటలు తిట్టి, బెదిరించి, వారి విధులకు ఆటంకం కలిగించినాడు అని ఆదివారం రోజున మోటకొండూర్ పంచాయతీ సెక్రెటరీ సంతోష్ స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా బాల్డా వెంకటేష్ తండ్రి యాదయ్యపైన కేసు నమోదైనది అని విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో ఎస్సై అశోక్ తెలిపారు.

## జోరందుకున్న అక్రమ నిర్మాణాలు...





శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : అక్రమ నిర్మాణాలపై పిర్యాదులు అందితే వెంటనే చర్యలు ఉంటాయని, బిల్డరులు పరిమితులు దాటకుండా పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఆదేశాలు బేఖాతరు చేస్తూ బిల్డింగు ల నిర్మాణాలు యదేచ్చగా కొనసాగుతున్న పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది. ఫిర్యాదులు చేస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని జి హెచ్ ఎం సి ఉన్నత అధికారుల మాటలు నీటి మూటలేనా అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. హైటెక్ సిటీ కి అత్యంత సమీపంలో ఉన్న శ్రీ రామ్ నగర్ కాలనీ, రాఘవేంద్ర, రాజరాజేశ్వరి కాలనీలో మరియు మాదాపూర్ డివిజన్ తదితర ప్రాంత్రాలలో పిర్యాదులు చేసిన బుట్ట దాఖలు చేయడం గమనార్హం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాల జోరు తో బోర్ నీరు అడుగంటి ట్యాంకర్ ల పై ఆధారపడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యింది అని అలాగే పార్కింగ్ సౌకర్యం లేకుండా భవనాలు నిర్మిస్తున్న పట్టించుకొక పోవడం తో రోడ్ల మీద పార్కింగ్ లు, ట్రాపిక్ సమస్యలు, పరిమితికి మించి నివాసం ఉంటున్న ప్రజల దైనందిన కార్యక్రమాలు అధికం అవడం తో డ్రైనేజీ పొంగి పొర్లి రోడ్ల పై పారి దుర్గంధం వెదజలుతున్నాయి అని కాబట్టి గతంలో శ్రీ రామ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అక్రమ నిర్మాణాలపై, హాస్టల్ నిర్వాహకుల పై పిర్యాదులు చేయడం బహిరంగ నిరసన కార్యక్రమం ను సైతం చేపట్టారు. ప్రజల ప్రయోజనం కోసం జి హెచ్ ఎం సి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ జాబితాలో చేర్చే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్న గోపి రజక

### తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి

### రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్న జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ లలిత



**వికారాబాద్, ఏప్రిల్ 26(క్రైమ్ మిర్రర్):** దేశవ్యాప్తంగా ఒకే కులవృత్తి చేసే రజకులకు భిన్న రిజర్వేషన్లు తగదని కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడకుండ మిగతా 11 రాష్ట్రాలను తక్షణమే ఎస్సీలో చేర్చాలని గోపి రజక డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కోడంగల్ మండలం పర్సాపూర్ లో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు చాకలి లలిత అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన మండల నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక హాజరై మాట్లాడుతూ దశాబ్దాలుగా రజక నాయకులు ఎస్సీ జాబితాలో చేర్చాలని పోరాటాలు చేస్తున్న పోరాటాలను గుర్తించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2016లో ఏనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీలో , డీకే అరుణ 2023 ఎలక్షన్ సమయంలో, లోకేష్ యువగళం పాదయాత్రలో నారా చంద్రబాబు నాయుడు,శాసన మండలిలో కల్వకుంట్ల కవిత,జోడో పాదయాత్రలో రాహుల్ గాంధీ , లోక్ సభలో రెండు సార్లు ఎంపీలు దోబీలను ఎస్సీలో చేర్చాలని ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ నాయకులు వివిధ సందర్భాలలో మాట్లాడటం జరిగింది. కానీ ప్రభుత్వ ఏర్పాటు అయ్యాక ఎస్సీ రిజర్వేషన్ అంశాన్ని మాట్లాడకుండా మరుగున పడేయడం రజకులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం, వృత్తిదారుల సమస్యలను గాలికి వదిలేయడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్లను ఈ ప్రభుత్వం చేయకుండా అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ అశోక్,జిల్లా ఉపాధ్యక్షులు రావులపల్లి బాలప్ప, దౌల్తాబాద్ గడ్డమీద వెంకటప్ప, బిచ్చాల్ సిహెచ్ మొగులప్ప, కోడంగల్ మండల అధ్యక్షులు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి



### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### సిపిఐ జాతీయ కార్యదర్శి మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి

**చౌటుప్పల్, ఏప్రిల్ 26, క్రైమ్ మిర్రర్:** మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని కరువు ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు త్రాగునీరు అందించేందుకు చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి 3 లక్షల 61 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలా నరసింహారెడ్డిలతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... జీవో నెంబర్ 107 విడుదల చేసి 11-06-2015 తేదీన చర్లగూడెం వద్ద గత ప్రభుత్వం ఈ పథకానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 3 లక్షల 41 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి , చర్లగూడెం, రిజర్వాయర్ల నిర్మాణం జరుగుతున్నాయి కానీ ఈ ప్రాజెక్టు విషయమై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన ఏదుల్లా రిజర్వాయర్ నుండి రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల పాటు 30 టీఎంసీలు నీటిని తీసుకునే విధంగా డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అవసరమైనన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లాలో సుమారు 3 లక్షల 41 వేల ఎకరాలకు సాగునీరు వందల గ్రామాలకు త్రాగునీరు ఇచ్చే శ్రీశైలం సొరంగం పనులు పూర్తి చేసేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వలన నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. ఇంకా 9.5 కిలోమీటర్లు సొరంగం తవ్వాల్సి ఉందని ఈ బడ్జెట్లో కేటాయించిన 800 కోట్లు సరిపోవని అన్నారు. పూర్తి నిధులు ఇచ్చి త్వరితగతిన పూర్తి చేయుటకు పర్యవేక్షణ కమిటీని వేయాలని కోరారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనైనా ఫ్లోరిడ్ పీడత కరువు, కాటకాలతో ఉన్న నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయడానికి డిండి ఎత్తిపోతల పథకం ,శ్రీశైల సొరంగ మార్గాన్ని తక్షణమే పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాట్లాడుతూ... చర్లగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి నారాయణపురం మరియు చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించే విధంగా ఈ ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి,చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సిపిఐ నాయకులు బద్దుల సుధాకర్, రొండి నరసింహ, కొండూరు వెంకటేష్, టంగుటూరి రాములు, దాసరి మనోహర్, శనిగల వెంకటేష్, సికిల్ మెట్ల రమేష్, కొత్త వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పిలుపునిచ్చిన కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా




**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం నేడు బి ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వం ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో పార్టీ జెండా ఎగరవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్లు, అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకు రాళ్లు, యువ, విద్యార్థి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొనవలసిందిగా మనవి చేశారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం: నరసింహ గౌడ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 26:** ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తామని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ తెలిపారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత జయంతి సందర్భంగా ఆదివారం బీరంగూడ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయమని నరసింహ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, జ్ఞానేశ్వర్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవాలు

## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు



**బాలానగర్, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, బాలానగర్ మండలంలోని ఫతేనగర్ డివిజన్‌లో భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మిక వాతావరణం నిండిన విశేష కార్యక్రమం ఘనంగా జరిగింది. మహానుభావుడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ ఆరాధన మహోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. భక్తుల హాజరుతో ప్రాంతం ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కంచి మహేందర్, పులి శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన పండాల సతీష్ గౌడ్, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు భవిష్యత్తును ముందుగానే తెలిపిన మహానుభావుడని, ఆయన కాలజ్ఞానం నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సమాజానికి ఆధ్యాత్మిక విలువలు, నీతి, నమ్మకం పెంపొందించడంలో స్వామివారి బోధనలు ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జయరాములు, రెడ్డప్ప డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్, శ్రీశైలం, సునీల్ బ్రహ్మచారి, గోవింద్, కృష్ణ, రవి, పులి శ్రీకాంత్ పటేల్, హైదరాబాద్ కాంగ్రెస్ మాజీ జెంట్స్ సెక్రటరీ అశోక్ చారి, కనతాల శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నుండి నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రాంత ప్రజల ప్రశంసలను పొందింది. ఈ మహోత్సవం ద్వారా భక్తి, సేవా భావం, సామాజిక ఐక్యత మరోసారి ప్రతిఫలించాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# నూతన జోనల్ కమిషనర్ గా నారాయణ్ అమిత్ మలెంపాటి....

### శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ అమిత్ మలెంపాటి....



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. జీ.ఎచ్.ఎమ్ సీ.పరిధిలోని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా నారాయణ్ అమిత్ మలెంపాటి, ఐఏఎస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు. (జీ ఓ.)నంబర్ 542 ప్రకారం ఆయన ఈ పదవిలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు శేరిలింగంపల్లి సర్కిల్-49 డిప్యూటీ కమిషనర్ సేవ ఇస్లావత్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయం మరియు సర్కిల్-49 కు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమై జోనల్ పరిధిలోని పరిపాలన, అభివృద్ధి పనుల గురించి ప్రాథమికంగా చర్చించారు.

# బిఆర్ టియు ఆటో యూనియన్ మేడే పోస్టర్ ను విడుదల చేసిన కేటీఆర్



**కుత్బుల్లాపూర్, జనవరి 26 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ భవన్ లో మేడే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బి ఆర్ టి యు ఆటో యూనియన్ ముద్రించిన మేడే పోస్టర్ ను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హైమద్ భాయ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి మల్లేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ బాబు, మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గౌడ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు రమేష్, చిన్న, ఆనందు, ఖురాన్, శేఖర్, బాలకృష్ణ, అశోక్, నరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

### అతివేగంగా దూసుకొచ్చిన లారీ పాదాచారిని ఢీకొట్టింది... అక్కడికక్కడే మృతి

### డ్రైవర్ నిర్లక్ష్యం మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం... బాలానగర్ సిఐ నరసింహారాజు



**బాలానగర్, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ ప్రాంతంలో మళ్లీ నిర్లక్ష్య డ్రైవింగ్ ఒక అమాయక ప్రాణాన్ని బలి తీసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఈ దారుణ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. బాలానగర్ సీఐ టి. నరసింహారాజు తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ నుంచి వై జంక్షన్ వైపు వెళ్తున్న లారీ (టూ07ఖూ1278) ఇందిరానగర్ యూ-టర్న్ వద్ద రోడ్డు దాటుతున్న పాదచారిని ఢీకొట్టింది. అతివేగంతో దూసుకొచ్చిన ఈ లారీ బలంగా ఢీకొట్టడంతో, బాధితుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఇందిరానగర్ నివాసి బానోత్ కిషన్ (45)గా గుర్తించారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, డ్రైవర్ నిర్లక్ష్యం, మితిమీరిన వేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. బాలానగర్ ప్రాంతంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ, వేగ నియంత్రణ చర్యలు కఠినంగా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం... ఒక కుటుంబానికి తిరిగిరాని నష్టం. జాగ్రత్తగా డ్రైవ్ చేయండి -- ప్రాణాలు కాపాడండి.

# భక్తి శ్రద్ధలతో వాసవి మాత జయంతి వేడుకలు



### అవోపా మేడ్చల్ జిల్లా కమిటీ మజ్జిగ పంపిణీ

**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** శ్రీ వాసవి మాత జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఆర్యవైశ్య ఆఫీషల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కూకట్ పల్లి జోన్ ఆల్విన్ కాలనీ ఫేజ్.01 బస్ స్టాప్ వద్ద బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు. మేడ్చల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి వొలిశెట్టి సురేష్ కుమార్, కోశాధికారి ఆదిమోలు సతీష్ కుమార్, హైదరాబాద్ జోన్ కోశాధికారి ఏం.వెంకటేష్ లు ముందుగా వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అదే విధంగా సహకరించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతకు, సురేష్ కుమార్, సతీష్ లు అవోపా మేడ్చల్ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దారం వెంకటేష్, పబ్బా శ్రవణ్ కుమార్, సాయి రాఘవేంద్ర, పవన్ కుమార్, పొలిశెట్టి సతీష్, టి.గురు ప్రసాద్, భరత్ గుప్త, కృష్ణ కిషోర్, వేణు, ఏ.శ్రీనివాస్, రాము, అమరవాది యాదగిరి, ఎల్లకొండ జయకుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# లక్ష రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎల్ ఓ సీ పత్రాలు అందజేత

### టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్



**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో మరోసారి మానవతా పరిమళం వెల్లివిరిసింది. కూకట్ పల్లి డివిజన్ దయరుగూడకు చెందిన జిల్లెల రాణి (56), భర్త నరేందర్ రెడ్డి కుడి కన్ను చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరిన సందర్భంలో, వారికి ఆర్థిక సహాయం అందించబడింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 1,00,000 (లక్ష రూపాయల) ఎల్ వో సి పత్రాన్ని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చేతుల మీదుగా నరేందర్ రెడ్డి కి అందజేశారు. ఈ సహాయం పట్ల నరేందర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, మేకల రమేష్, తూము సంతోష్, గంధం రాజు, మేకల సుదర్శన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాలు అవసరమైన వారికి చేరుతున్నాయని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది.

# కూకట్‌పల్లి డివిజన్‌లో జనసేనకు యువత భారీ చేరిక

### పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణం

### జనసేన పార్టీలో కొత్తగా చేరిన యువతకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించిన పార్టీ కో-ఆర్డినేటర్ ప్రేమకుమార్




**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీకి యువత మద్దతు రోజురోజుకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని 5వ ఫేజ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్‌కు చెందిన పలువురు యువకులు అధికారికంగా జనసేనలో చేరారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న ప్రజా సేవా కార్యక్రమాలు, ఆయన ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఈ యువత చేరినట్లు తెలిపారు. ఈ చేరిక కార్యక్రమాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గ అడక్ కమిటీ సభ్యుడు వేముల మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ ప్రేమకుమార్ కొత్తగా చేరిన యువతకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రోహిత్ గౌడ్, సాయి శ్రవణ్, భాను ప్రకాష్, రోహన్, సాయి పవన్ తేజ్, భరత్, గణేష్, వర్షిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ జనసేనలో యువతకు విశేష ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తే మంచి నాయకులుగా ఎదగడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, రణదీప్, గుణశేఖర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా కూకట్‌పల్లి ప్రాంతంలో జనసేన పార్టీ బలం పెరుగుతున్న సంకేతంగా ఈ యువత చేరిక నిలిచింది.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption

విలేకరులు కావలెను

క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్, కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.

ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.

Email ID: crimemirrorts@gmail.com

9393 44 6188

# 400 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారు..?

## ప్రభుత్వ భూమిని కాపాడుతామని చెప్పే హైడ్రాధికారులకు ఇది కనబడటం లేదా?

## కబ్జాకు గురికాకుండా చూసి ప్రభుత్వ పాఠశాలకు చందెల చర్యలు తీసుకోవాలి

## కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** హైటెక్ సిటీకి కూతవేటి దూరంలో 400 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా అవుతుంటే రెవెన్యూ అధికారులు హైడ్రాధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ సర్వేనెంబర్ 18లో బిఆర్ఎస్ ప్రభుత్వంలో 4 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తెలుగు మీడియం ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలకు రెండు రెండు ఎకరాల భూమిని కేటాయించి జిహెచ్ఎంసి ద్వారా చుట్టూరా ప్రహరీ గోడ కట్టాలని చెప్పాం. గత ఆరు సంవత్సరాలుగా కోర్టులో స్టే ఉన్నటువంటి స్థలాన్ని ప్రభుత్వ స్థలం అని రుజువు అయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని అప్పటి నుంచి కలెక్టర్ మంత్రులకు వినతి పత్రాలను అందజేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాఠశాలను నిర్మించాలని కృషి చేశానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెప్పారు. కానీ రెవెన్యూ అధికారులు కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నేతలు కుమ్మక్కై నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి సుమారు 400 కోట్ల రూపాయల విలువ చేసే భూములను కబ్జాదారులు ఏకంగా స్థలంలో మట్టి నింపి ఇంటి నిర్మాణం కోసం జెసిబి తో గుంటలు తీస్తుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని మాటలు చెప్పే హైడ్రాధికారులకు 400 కోట్ల విలువ చేసే భూములు గద్దల్లాగా వాలి కబ్జాలు చేస్తుంటే కనబడట్లేదా అని ఎమ్మెల్యే అన్నారు. హైడ్రాధికారులకు ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలంలో కబ్జాలు నిలిపివేయాలని ప్రభుత్వ పాఠశాలకు చెందేలా చర్యలు తీసుకోవాలని హైడ్రాకు ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

ప్రభుత్వం కానీ రెవెన్యూ అధికారులు కానీ 400 కోట్ల విలువ చేసే భూమిని కాపాడి పాఠశాలకు చెందే విధంగా కృషి చేయాలి తప్ప కబ్జాదారులకు మద్దతుగా నిలబడి పని చేస్తే చూస్తూ ఊరుకోనని కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందే విధంగా కష్టపడతానని కబ్జాదారులపై అధికారులు క్రిమినల్ కేసులు పెట్టకపోతే ఊరుకోనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, ఐలయ్య, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# మాత రమాయి అంబేద్కర్‌కు ఘన నివాళులు

## అర్పించిన గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు

**బాలానగర్, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** ముంబైలోని వర్లీనాకా ప్రాంతంలో ఉన్న మాత రమాయి అంబేద్కర్ సమాధి స్థలం "త్యాగభూమి"ని తెలంగాణకు చెందిన ప్రముఖ అంబేద్కరైట్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కర్క నాగరాజు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "మాత రమాయి స్మారక సమితి" అధ్యక్షులు అమోల్ సాలుంకే నాగరాజుకు బుద్ధుడి పంచశీల ఖండువ కప్పి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మాత రమాయి సమాధి వద్ద కొవ్వొత్తులు వెలిగించి, పూలమాలలు అర్పించి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక మాత రమాయి అంబేద్కర్ అని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లిన సమయంలో కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని, పిడికలు అమ్మి వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తూ, ఆయన చదువులకు సహకరించిన గొప్ప త్యాగమూర్తి రమాయి అని పేర్కొన్నారు. తన పిల్లలు సరైన వైద్య సదుపాయాల లేమితో మరణించినప్పటికీ, ఆ బాధను తనలోనే దాచుకుని కోట్లాది భారతీయులను తన సంతానంగా భావించిన గొప్ప మాతృమూర్తిగా ఆమెను స్మరించుకున్నారు. "ప్రతి విజయవంతమైన వ్యక్తి వెనుక ఒక మహిళ ఉంటుందనే నానుడికి అంబేద్కర్ జీవితం గొప్ప ఉదాహరణ" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మహారాష్ట్ర కార్యదర్శి నాగ్ సేన్ మాలజీ, ఎం.టి.బి.ఎఫ్ నాయకులు సతీష్ యాదవ్, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు. మాత రమాయి అంబేద్కర్ త్యాగం, సేవలు సమాజానికి చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.





# గంధంగూడలో హిందూ మహా సమ్మేళనం ఘన విజయం -- వేలాది భక్తుల సందడి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** హైందవకోట పరిధిలోని గంధంగూడలో నిర్వహించిన హిందూ మహా సమ్మేళనం ఘన విజయాన్ని సాధించింది. ఏప్రిల్ 25 సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఈ మహాసమ్మేళనానికి ప్రజలు అనూహ్యంగా భారీ సంఖ్యలో హాజరయ్యారు. దాదాపు నాలుగు గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంతో హైందవకోట బస్తీ మొత్తం కాషాయమయం అయింది. సుమారు 3,800 మంది భక్తులు పాల్గొన్న ఈ వేడుకలో అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రముఖుల ప్రేరణాత్మక ప్రసంగాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి బాపూ ఘాట్ సంగం దేవాలయ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రాహుల్ మహారాజ్ విచ్చేసి భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వక్తలు హిందువులంతా ఐక్యంగా ఉండాలని, ధైర్యంగా సవాళ్లను ఎదుర్కోవాలని, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపుని చ్చారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంతో పాటు పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధపెట్టాలని సూచిం చారు . హైందవకోటలోని హిందూ సమాజం ఈ కార్యక్రమాన్ని తమ భుజస్కంధాలపై తీసుకుని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది.



# ఘనంగా వడ్లకొండ సందీప్ జన్మదిన వేడుకలు

**నిజాంపేట్, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్):** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ నాయకుడు వడ్లకొండ సందీప్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సందీప్‌ను శాలువా మరియు పూల బొకేలతో ఘనంగా సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎం.సి బి.ఆర్.ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, ప్రగతి నగర్ నాయకులు బోట్ల తిరుపతి, శరత్ రెడ్డి, శివ రామకృష్ణ, జానకిరామ్, విజయ్ భాస్కర్ రెడ్డి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# గంధంగూడలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి పూజలు

**గండిపేట(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు గంధంగూడలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి హోమం, చండీ హోమం నిర్వహించారు. సామూహిక చండీ హోమంలో సోలన మోహన సురేశ్‌లఖిత్ రాహుల్‌లక్ష్మి సాహిత్ గోత్రం, విశ్వనాథంనిర్మలసురేందర్, గోనుగుంట్ల రమేష్‌కుమార్‌లక్ష్మీ, ప్రసన్నశైలజ, సిరిపురం రాజకళ్లపురుషోత్తం, రవీంద్ర కులకర్ణి, రాజేశ్వరి గోత్రం మౌన భార్గవ, రాచూరి సిద్ధుజ సందీప్, గుడిపాటి శివకృష్ణ, స్వప్న, వెంకట్‌రెడ్డి, శిరీష చండీ హోమంలో భక్తులు వాసవి అమ్మవారి నినాదాలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. దాదాపు 20 వారాలు ప్రతి శుక్రవారం అమ్మవారికి పోసిన మహిళలకు చీరలు సారెలు సమర్పించారు. దాదాపుగా 300 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





# శ్రీ గాయత్రి పొదుపు సంఘం ప్రగతి పథం


## రూ. 5.55 కోట్ల నిధులతో ఆదర్శంగా నిలుస్తున్న సంఘం

## ఘనంగా 26వ వార్షికోత్సవ వేడుకలు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** అత్తాపూర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధి, ఆదర్శ కాలనీలో వెలసిన శ్రీ గాయత్రి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం 26వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక కార్యాలయంలో వైభవంగా జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ సర్వసభ్య సమావేశంలో సంఘం సాధించిన అద్భుతమైన వృద్ధిని నిర్వాహకులు వెల్లడించారు. సంఘ కార్యవర్గం తెలిపిన వివరాల ప్రకారం.. 2000 సంవత్సరంలో కేవలం 14 మంది సభ్యులతో అత్యంత సాదాసీదాగా ప్రారంభమైన ఈ సంఘం, నేడు 681 మంది సభ్యులతో బలోపేతమైంది. సంఘం యొక్క మొత్తం నిధులు రూ. 5,55,11,133 (ఐదు కోట్ల యాభై ఐదు లక్షల పదకొండు వేల నూట ముప్పై మూడు రూపాయల) కు చేరడం విశేషం. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ.. సభ్యులకు వసూళ్లు, చెల్లింపులు, ఆస్తులు మరియు అప్పుల పట్టికలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సలహాదారులు కూడికల గణమ్మ, అధ్యక్షులు ఏదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దశపతి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఏర్వ కుమారస్వామి, సహాయ కార్యదర్శి దశపతి రాజు, కోశాధికారి గుర్రం తిరుపతమ్మ పాలక వర్గ సభ్యులు ముదిగొండ సత్యనారాయణ, గాజుల సురేష్ యాదవ్, కూడికల ప్రభాకర్, అదేట్ల బాలరాజ్, అదేట్ల నరేష్, గంజి శ్రీశైలం, మాసిని వనజ, గంజి రాజేశ్వరి, సగ్గం మహేందర్, మేకల సాయికిషోర్, సాక మమత, ఆడిటర్ విజయ సింహారెడ్డి, బాలాజీ అసోసియేషన్ మేనేజర్ బొల్ల లక్ష్మీనారాయణ, సిబ్బంది గంజి మార్కండేయ, ఏశాల శివ మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాసవి జయంతి ఉత్సవాల్లో ఆదర్శ్ రెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 26:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ శివాలయం ప్రాంగణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి 4644వ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు శ్రీ సాయి గణేష్ కాలనీ, బీరంగూడలో నిర్వహించిన శ్రీ యెల్లమ్మ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి

ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు

13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటుంది

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించలేదు

ఏప్రిల్ 29న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీలు బందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసు పిలుపు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 26 (క్రైమ్ మిర్రర్) :** రాష్ట్ర ప్రభుత్వం 8 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బి.ఆర్.ఎస్ వి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ వి ఫీజు పోరుబాట సందర్భంగా బి ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వాసు మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడు దల చేయకపోవడం వల్ల పై తరగతులకు వెళ్లడానికి, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఒరిజి నల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వానికి బడా కాంట్రాక్టులకు కమిషన్ ఇచ్చే కాంట్రాక్టులకు బిల్లులు చెల్లిస్తుంది కానీ చేయడం లేదన్నారు. చదువుతున్న విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్ మెంటు విడుదల చేయాలని ఎన్ని నిరసనలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదు, ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు చెల్లించకపో వడం వల్ల విద్యార్థులు మానసిక శోభకు గురై సరైన విద్యను పొందలే కపోతున్నారు. రీయంబర్స్ మెంట్ విడుదల కాక పోవటం వల్ల విద్యా ర్థులు పై చదువులకోసం లేదా ప్రభుత్వ/ ప్రైవేటు ఉద్యోగాలకోసం దర ఖాస్తు చేసుకునే వారికి ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వటం లేదు. కొన్ని యాజమాన్యాలు ప్రభుత్వం రీయంబర్స్ మెంట్ ఇవ్వడం లేదని రాష్ట్ర హైకోర్ట్ ను ఆశ్రయించారు, ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించినా కౌంటర్ వేయకపోవటం వల్ల వచ్చే విద్యా సంవత్సరం 2026,27 నుంచి విద్యార్థుల దగ్గరనుండి వసూలు చేసు కోవచ్చని చెప్పడం వల్ల ఫీజు భారం విద్యార్థి మీద పడి ఉన్నత విద్యకి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. అందుకే హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి కూడా పిర్యాదు చేయా లని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. బి ఆర్ ఎస్ వి నిరసన కార్యక్ర మాలు నేడు అన్ని జిల్లా కలెక్టరేట్లో ప్రజావా ణిలో ఫిర్యాదు చేస్తామన్నారు. 28 ఏప్రిల్ మంగళవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 1లక్ష పోస్టు కార్డుల ఫిర్యాదు పంప నున్నట్లు తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హైకోర్టు తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ సిటీ కాలేజ్ గంజి బజార్, మదీనా, చార్మి నార్, హైదరాబాద్500066. 29 ఏప్రిల్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలే జీల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



13 లక్షల మంది విద్యార్థి భవిష్యత్తు కొరకు రియంబర్స్మెంట్ నిధులు విడుదల



## పల్లెచెరువు వద్ద బొడ్రాయి ప్రతిష్టపన పూజలు

పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పల్లెచెరువులో బొడ్రాయి(నాభి శిల) ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ దేవుణ్ణి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాంజల సత్తయ్య, గోషామహల్ కృష్ణ, యాంజల సురేష్, గడ్డం కృపాకర్, సునీల్, చంద్ర, చరణ్, డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, టి.చిన్న, రమేష్‌రెడ్డి, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి



గండిపేట(క్రైం మిర్రర్): జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం చార్మినార్ జోనల్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు.

## హైదర్‌గూడలో భారత ప్రధాని నరేంద్రమోడీ మన్ కీ బాత్ ఎపిసోడ్ వీక్షించిన బీజేపీ నాయకులు



**గండిపేట(క్రైం మిర్రర్):** అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని బూత్ నెంబర్ 210 బూత్ అధ్యక్షుడు పొట్ట అనిల్ ఇంట్లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశం యొక్క అటువంటి ఒక గొప్ప విజయంతో మిత్రులారా భారతదేశం విజ్ఞాన శాస్త్రాన్ని ఎల్లప్పుడూ దేశ ప్రగతితో ముడిపెట్టి చూసింది ఇదే ఆలోచనతో మన శాస్త్రవేత్తలు సివిల్ న్యూక్లియర్ ప్రొగ్రాం ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. వారి కృషితో ఈ కార్యక్రమం రాష్ట్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దీని వల్ల మన ఇండస్ట్రీయల్ గ్రోత్‌కు ఎనర్జీ సెక్టార్‌కు హెల్త్ కేర్ సెక్టార్‌కు చాలా ప్రయోజనం చేకూరిందన్నారు. వ్యవసాయం నుంచి ఆధునీక ఇన్నోవేటర్లకు కూడా భారత సివిల్ న్యూక్లియర్ ప్రొగ్రాం చాలా సహాయపడిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్‌కుమార్, అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్యదర్శి పొట్ట గాయత్రి, 238 బూత్ క్రియాశీల సభ్యురాలు సాబాద స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పుప్పాలగూడ కొండమీద శిఆవలయంలో వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలలో భాగంగా గత తొమ్మిది రోజులు వాసవి అమ్మవారి పారాయణం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, రుద్ర హోమం, శ్రీ లక్ష్మికుబేర హోమం, వాసవి అమ ?మవారి హోమం, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. తదనంతరం భక్తులందరికి భోజన ప్రసాదం అందించారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ మణికొండ ప్రెసిడెంట్ వోలం యాదగిరి, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కమలానికి గుడ్‌బై... కార్ ఎక్కిన రాహుల్ అప్ప

శంషాబాద్‌లో రాజకీయ పేలుడు



**గండిపేట(క్రైం మిర్రర్):** గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ సర్కిల్ రాజకీయాల్లో ఒక్కసారిగా అగ్గి రాజేసింది. బీజేపీకి కీలకంగా పనిచేసిన రావుల అప్ప (రాహుల్ అప్ప) సంచలన నిర్ణయం తీసుకుని కమలాన్ని పక్కనబెట్టి కార్ ఎక్కడం రాజకీయ వర్గాలను కుదిపేసింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్ రెడ్డి సమక్షంలో ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.చేరిక వెంటనే రాహుల్ అప్ప పేలుడు వ్యాఖ్యలు చేశారు. ప్రజల కోసం నిజంగా పని చేసే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే... అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా. ఇకనుంచి నేనో కార్యకర్తగా కాదు, యోధుడిలా పని చేస్తా... శంషాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయం అంటూ గట్టిగా ప్రకటించారు.ఇక కార్తీక్ రెడ్డి మాటల్లో మరింత ఫైర్ కనిపించింది.ఇది కేవలం ఒక చేరిక కాదు... ఇది మారుతున్న రాజకీయ దిశకు స్పష్టమైన హెచ్చరిక. రావుల అప్ప లాంటి నాయకులు బీజేపీని వదిలి బీఆర్ఎస్ వైపు రావడం ప్రజల తీర్పుకు ముందస్తు సంకేతం. శంషాబాద్‌లో ఇక బీజేపీకి చాన్స్ లేదు... బీఆర్ఎస్ దూకుడు ఎవ్వరూ ఆపలేరు అంటూ సవాల్ విసిరారు. రాహుల్ అప్ప ఎంట్రీతో శంషాబాద్ రాజకీయ సమీకరణాలు తారుమారయ్యాయి. బీజేపీ శిబిరంలో కలవరం నెలకొనగా, బీఆర్ఎస్ వర్గాల్లో జోష్ డబుల్ అయింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరమేశ్వరి నరేందర్, కోలన్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నినాదాలతో సభను కుదిపేశారు.



## ఏవీవోపీఏ పుప్పాలగూడ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వాసవి మాత జయంతి

**గండిపేట(క్రైం మిర్రర్):** ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేట్ పుప్పాలగూడ శాఖ అధ్యక్షుడు దారం వేణుమాధవ్, కార్యదర్శి దారం భానుచందర్, కోశాధికారి అప్పని యుగంధర్‌ల ఆధ్వర్యంలో మణికొండ, మర్రిచెట్టు వద్ద గల శివాలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వధహించారు. పూజలు శాస్త్రవేత్తకంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారి పటాన్ని ఊరేగిస్తూ గణేష్ పూజ, వాసవి మాత కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వాసవి మాత జయంతిని రాష్ట్రం అధికారిక పండుగ గుర్తించినందుకు ఆర్యవైశ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పూజల్లో రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్, కార్యదర్శి సాయిరాం, మహిళా విభాగం కార్యదర్శి చైతన్య, మణికొండ మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి మహాలక్ష్మి, దేవిప్రియ, స్నేహ, శ్రావణ్, ప్రణీత్, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలు





గండిపేట(క్రైం మిర్రర్): కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలో గల వాసవి దేవాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్, దేవాలయ చైర్మన్ సోమ శ్రీనివాస్‌గుప్తాలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సంకురి జయప్రకాష్ నేత, అర్థం లక్ష్మయ్యగుప్తా, సిరంగి బుచ్చయ్యగుప్తా, బొమ్మ లింగయ్యగుప్తా, ఏ.లక్ష్మినారాయణగుప్తా, కలకొండ రామలింగయ్య గుప్తా, నరాబు అనంతంగుప్తా, విరబొమ్మ సురేష్‌గుప్తా, అర్థం శ్రీనివాసులుగుప్తా, పానుగంటి శేఖర్‌గుప్తా, గుడిపల్లి శేఖర్‌గుప్తా, గుట్టు ఆంజనేయులు, ఓరుగంటి మల్లేష్‌గుప్తా, గొంగలా వెంకటేశంగుప్తా, సోమ సందీప్, ఓరుగంటి సత్యనారాయణగుప్తా, బాలరాజ్‌గుప్తా, సంపత్‌గుప్తా, చిగుళ్లపల్లి సత్యనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వీధిదీపాలు ఏర్పాటు చేయించిన కిస్మత్‌పూర్ మాజీ వార్డు సభ్యులు మొన్నే వాసవినవీన్‌ముదిరాజ్



**గండిపేట(క్రైం మిర్రర్):** ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ప్రజా సమస్యలపై తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు కిస్మత్‌పూర్ మాజీ వార్డు సభ్యులు మొన్నే వాసవినవీన్‌ముదిరాజ్ తెలిపారు. ఓంనగర్ కాలనీలో సుమారు సంవత్సరం కాలంగా వీధిలైట్ల సమస్య ఉండడంతో ఎన్నోసార్లు జీహెచ్ఎంసీ అధికారులకు, సిబ్బందికి, పాత మున్సిపల్ కార్పొరేషన్‌లో మొరపెట్టుకున్న వీధిలైట్లు ఏర్పాటు చేయలేకపోవడం జరిగిందన్నారు. సమస్యను మాజీ వార్డు సభ్యులు మొన్నే వాసవి నవీన్‌ముదిరాజ్ దృష్టికి తీసుకుపోవడంతో సొంత నిధులతో ఓంనగర్ కాలనీలో పలుచోట్ల వీధిలైట్లు ఏర్పాటు చేయడం జరిగడింది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు కళ్లు తెరిచి మరి చాలా రోజులుగా ఉన్న వీధిలైట్ల ప్రాబ్లమ్ 122 డివిజన్ పరిష్కరించాలని కోరారు.